## క్లుప్తంగా

### 1న కామర్స్ గెస్ట్ ఫ్యాకల్టీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులకు మార్చి 1వ తేదీ ఉదయం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్బలక్షుమ్మ తెలిపారు. ఎంకాంలో 55 శాతం మార్కులు కలిగి, నెట్,సెట్/స్లెట్, ఎంఫిల్, పీహెచ్‌డీ అర్హత ఉన్న మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటాతో హాజరుకావాలని సూచించారు.

### నేడు ఆప్‌కీ ఆవాజ్ నగర మహాసభ

కడప వైఎస్ఆర్ సర్కిల్: నేడు నగరంలో ఆప్‌కీ ఆవాజ్ నగర మహాసభ నిర్వహించనున్నట్లు ఆర్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడ చూసినా మైనార్టీలపైన దాడులు జరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నేటి పరిస్థితుల్లో మైనార్టీలు వారి హక్కుల కోసం ఇతరులపైన ఆధారపడకుండా ఉండేలా చూడడంతో పాటు వారి ఐక్యత కోసం ఆప్‌కీ ఆవాజ్ పని చేస్తుందన్నారు. ఈ సమస్యలపై నగర మహాసభలో చర్చిస్తామని వివరించారు.

### ఓడీఎఫ్ ప్లస్ సర్వే పక్కాగా నిర్వహించాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న టీం లీడర్ రఘునాథన్

కడప కార్పొరేషన్: జిల్లాలోని పంచాయతీలు, గ్రామాల్లో ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ ప్లస్ సర్వే పక్కాగా నిర్వహించాలని టీం లీడర్ ఎం.రఘునాథన్ తెలిపారు. సోమవారం స్థానిక సేవా భారతి కార్యాలయంలో నిర్వహించిన ఒకరోజు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ అంటే ఏమిటీ, సర్వే ఎలా చేయాలి, దీనివల్ల కలిగే ఉపయోగాల గూర్చి వివరించారు. ఈ సర్వే ద్వారానే ఆయా పంచాయితీలకు, గ్రామాలకు ర్యాంకింగ్స్ అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు జె. శివయ్య, ఆర్ నరసింహులు, ఐఏసీ కో ఆర్డినేటర్ సురేష్ రాజు పాల్గొన్నారు.

### కార్మికులకు మెస్ చార్జీలను పెంచాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు మెస్ చార్జీలను పెంచాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా సోమవారం కలెక్టరేట్‌లోని స్పందనలో డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు మేరీ పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగ, ఉపాధ్యాయులను బాబు ఏరోజూ గౌరవించలేదు

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



కడప కార్పొరేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రతిపక్ష నేత చంద్రబాబు ఏనాడు గౌరవించలేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. సోమవారం మారుతీనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉపాధ్యాయులకు చదువు చెప్పడం కాకుండా మిగతా అన్ని పనులు అప్పగించి వేధించారన్నారు. గత ప్రభుత్వంలో కూడా జీతాలు ఇవ్వడానికి నెల, రెండు నెలలు పట్టిన సందర్భాలున్నాయని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని రెచ్చగొట్టేలా మాట్లాడినా ఎక్కడా వారిని అగౌరవ పరిచేలా వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట రాక్షసుడు జగన్ అని లోకేష్ మాట్లాడటం దారుణమన్నారు. లోకేష్ తన భాషను సంస్కరించుకోవాల్సిన అవసరముందని చెప్పారు.

### తాగునీరు అందించాలి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో తాగునీరు సక్రమంగా అందించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, నగర కార్యవర్గ సభ్యులు మునెయ్య, మైనుద్దీన్ కోరారు. సోమవారం వారు కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతి పత్రమిచ్చారు. రవీంద్రనగర్, మురాదియానగర్, నబీకోట్, రామరాజుపల్లె, అక్కాయపల్లె ప్రాంతాల్లో తాగునీరు రోజు మార్చి రోజైనా సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పన్ను వసూళ్లలో ఇదేం పద్ధతి!

- ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించడం తగదు
- కమిషనర్‌కు కార్పొరేటర్ల వినతి



మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతిపత్రమిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో పన్ను వసూళ్లు సున్నితమైన పద్ధతిలో చేయాలని కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు సోమవారం 40 మందికిపైగా కార్పొరేటర్లు కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకవర్గం తీసుకున్న నిర్ణయం మేరకు కాకుండా అధికారులు తమకు ఇష్టం వచ్చినట్లు వసూలు చేస్తున్నారని, పంచాయతీల్లో కల్లాలు, వామిదొడ్లకు కూడా వీఎల్‌టీ వేస్తున్నారని, అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్ పేరుతో చిన్న చిన్న బోర్డులకు గతం కంటే ఎక్కువ ట్యాక్స్ వేస్తున్నారన్నారు. మూసి ఉన్న షాపులకు కూడా ట్రేడ్ లైసెన్స్ కట్టాలని నోటీసులు జారీ చేస్తున్నారన్నారు. ఒక్కో షాపు వద్దకు 50–60 మంది సచివాలయ సిబ్బంది వెళ్లి షాపుల ఎదుట ధర్నా చేయడం వల్ల ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. ఇంప్రూవ్‌మెంట్ ట్యాక్స్ పేరుతో ప్రతి ఇంటికి వెళ్లి పన్నులు పెంచుతున్నారని, ప్లాన్ లేదని అపరాధ రుసుము విధిస్తున్నారని, ప్లాన్ చూపిస్తే కాలం చెల్లినదిగా పేర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయల బకాయిలు ఉన్నవారిని వదిలేసి మైక్రో ఫైనాన్స్ వారి తరహాలో బలవంతపు వసూళ్లకు పాల్పడటం సరికాదన్నారు. వీటన్నింటిపై చర్చించేందుకు ఎన్నికల నియమావళి పూర్తయిన వెంటనే అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించాలని కోరారు. అనంతరం వారు ఇదే విషయమై డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులను కలిసి వినతిపత్రాలు అందించారు. కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, సానపురెడ్డి శివకోటిరెడ్డి, ఎం. సుబ్బారెడ్డి, షఫీ, బాలస్వామిరెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, జఫ్రుల్లా, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జులు ఐస్‌క్రీం రవి, శ్రీరంజన్‌రెడ్డి, బండి ప్రసాద్, చల్లా రాజశేఖర్, కో ఆప్షన్ సభ్యుడు జమీర్ పాల్గొన్నారు.

**మొండి బకాయిలను వసూలు చేయాలి**

నీటి పన్ను మొండి బకాయిలను పెద్ద మొత్తంలో వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం ఉదయం ఇంజినీరింగ్ అధికారులు, ఫిట్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు నీటి కొరత రాకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. నీటి సరఫరాపై గానీ, నీటి పన్నుపై గానీ ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గుంత బజారులోని అంగన్‌వాడీ కేంద్రంలో మరమ్మతులు చేయించి మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం 33వ డివిజన్‌లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్మికులకు పనిముట్లు అందజేయాలని సూచించారు.

**అర్జీలను సకాలంలో పరిష్కరించాలి**

'స్పందన' అర్జీలను సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సీపీ సంజీవ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎస్‌ఈ, ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

## విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



విద్యార్థినులకు క్రికెట్‌పై అవగాహన కల్పిస్తున్న సీపవైడీ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: మహిళా క్రికెట్‌లో ఉన్న అవకాశాలను విద్యార్థినులు చక్కగా సద్వినియోగం చేసుకోవాలని మాజీ రంజీ క్రీడాకారుడు పైడికాల్వ విజయ్ కుమార్ సూచించారు. సోమవారం కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్) విద్యార్థినులకు క్రికెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారిణులు ప్రతిరోజూ సాధన చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ ఉమన్ క్రికెట్ కోఆర్డినేటర్ విష్ణుమోహన్‌రావు మహిళా క్రికెట్‌లో గల అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా ఆరాధన

చింతకొమ్మదిన్నె: మండలంలోని తాడిగొట్ల పంచాయితీ పరిధిలోని స్పిన్నింగ్ మిల్ వద్ద నున్న చిన్నపల్లె యోగి శ్రీ శ్రీ నరసింహస్వామి ఆరాధన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, ఆరాధన కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నదానం చేశారు.

**రసవత్తరంగా బండలాగుడు పోటీలు....** ఆరాధన సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలకు 9 జతల ఎద్దులు పాల్గొనగా గెలుపొందిన ఎద్దులకు ఆలయ నిర్వాహకులు బహుమతులను అందజేశారు. అనంతరం కోలాటం నిర్వహించారు.

## వనరుల అన్వేషణకు నైపుణ్యాలు అవసరం

– వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి



సదస్సులో పాల్గొన్న వైవీయూ ఆచార్యులు

వైవీయూ: అసాధారణ వనరుల అన్వేషణకు భూగర్భ శాస్త్రవేత్తలకు నైపుణ్యాలు అవసరమని యోగివేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైవీయూ భూగర్భశాస్త్రశాఖ ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జియో సైన్స్' అన్న అంశంపై ఐదురోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్న జాతీయ సాంకేతిక సదస్సును సోమవారం ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులు, వాటిని ప్రాసెస్ చేయగల సామర్థ్యం సమకాలిన సమాజానికి అవసరమని, వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేలా పరిశోధకులు కృషిచేయాలని సూచించారు. చెన్నైలోని మద్రాస్ విశ్వవిద్యాలయం భూగర్భశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.ఎం. హుస్సేన్ మాట్లాడుతూ శిలాజశాస్త్రం ఏ విధంగా ఉపయోగపడతాయో విశదీకరించారు. సదస్సు కన్వీనర్లు వైవీయూ ఆచార్యులు వి. సునీత, కె. రఘుబాబు మాట్లాడారు. ఆచార్య జి. సుదర్శన్‌రాజు, ఆచార్య ఎస్. జయరాజు, డా. ఎస్. శ్రీనివాసగౌడ్, డా. ఆర్. సిద్దిరాజు పాల్గొన్నారు.

## అత్యాధునిక పరికరాలతో డెర్మటాలజీ సేవలు

– నగర మేయర్ సురేష్‌బాబు



డెర్మటాలజీ విభాగాన్ని ప్రారంభిస్తున్న నగర మేయర్ సురేష్‌బాబు



విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కళాశాల ఈడీ సల్మాన్, చైర్మన్ ఏక్యూ జవ్వాద్

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో అత్యాధునిక పరికరాలతో డెర్మటాలజీ విభాగంలో సేవలు అందించడం అభినందనీయమని కడప నగర మేయర్ సురేష్ బాబు తెలిపారు. సోమవారం ఫాతిమా మెడికల్ కళాశాలలో కరస్పాండెంట్ ఏక్యూ జవ్వాద్ ఆధ్వర్యంలో డెర్మటాలజీ, డెంటల్ సంబంధిత అత్యాధునిక పరికరాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలతో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం కళాశాల యాజమాన్యానికి గల దాతృత్వాన్ని నిదర్శమని మేయర్ ప్రశంసించారు. కళాశాల చైర్మన్ ఏక్యూ జవ్వాద్, కళాశాల డైరెక్టర్ జయరామిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఓబులేశు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్, వైస్ ప్రిన్సిపాల్ రామమనోహర్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు అభినందన**

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల ప్రకటించిన ఎంబీబీఎస్ పరీక్షా ఫలితాల్లో ఫాతిమా మెడికల్ కళాశాల విద్యార్థులు రాష్ట్రంలోనే 98 శాతం ఉత్తీర్ణత సాధించడం ప్రశంసనీయమని కళాశాల చైర్మన్ ఏక్యూ జవ్వాద్ తెలిపారు. సోమవారం ఫాతిమా కళాశాలలోని కాన్ఫరెన్స్ హాలులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చైర్మన్ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్, డైరెక్టర్ జయరామిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఓబులేశు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమనోహర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ సీసీ కమలాకర్, వైద్యులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తైక్వాండో క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న అహ్మద్‌బాషా

కడప స్పోర్ట్స్: కడప నగరానికి చెందిన పలువురు తైక్వాండో క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీల్లో పతకాలు సాధించడంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్.బి. అహ్మద్‌బాషా అభినందించారు. సోమవారం నగరంలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. తైక్వాండో శిక్షకుడు మాస్టర్ జంషీర్ మాట్లాడుతూ ఈనెల 26న పోరుమామిళ్లలో నిర్వహించిన 4వ జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు 16 పతకాలు సాధించినట్లు తెలిపారు. ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్. ఇలియాస్‌బాషా, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

## 2న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నాగార్జున దాసరి తెలిపారు. తిరుపతి జిల్లాలోని శ్రీ సిటీలోని మల్టీ నేషనల్ కంపెనీ ఎస్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ట్రైనీగా పనిచేసేందుకు బీఎస్సీ (ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, ఎంపీసీ), డిప్లొమా చదివి 2018 నుంచి 2022వ సంవత్సరంలోపు 18–26 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన యువతీ యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి మూడు నెలలపాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారన్నరు. నెలకు రూ. 15,809 వేతనంతోపాటు ఇతర అలవెన్సులు ఉంటాయని వివరించారు. రిజిస్ట్రేషన్ కోసం 63001 25455, 78929 33270 నెంబరులో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి.. అర్హత ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## అందుబాటులోకి మోకాళ్ల మార్పిడి రోబోటిక్ సర్జరీ



మాట్లాడుతున్న డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి

కడప రూరల్ : మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నట్లు నెల్లూరు అపోలో హాస్పిటల్ ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్, రోబోటిక్ రీ ప్లేస్‌మెంట్ సర్జన్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక మానస ఇన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో రోబోటిక్ ద్వారా మోకాళ్ల మార్పిడి సర్జరీని నిర్వహిస్తున్నామన్నారు. ఈ చికిత్స మహానగరాలలో మాత్రమే లభించేదన్నారు. తాజాగా అత్యాధునిక టెక్నాలజీతో నిర్వహించే రోబోటిక్ సర్జరీ సౌకర్యం అందరికీ అందుబాటులో ఉందన్నారు. గతంలో మోకాళ్ల మార్పిడి సర్జరీ ద్వారా ఎన్నో సమస్యలు ఎదురయ్యేవన్నారు. రోబోటిక్ సర్జరీ ద్వారా రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నొప్పి, కోత లాంటివి లేకుండా సర్జరీ ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ సదుపాయం కలదని, అలాగే నిరుపేదలకు ఫీజులో 15 శాతం రాయితీ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు కార్తీక్‌రెడ్డి, వివేకానందరెడ్డి, శశిధర్‌రెడ్డి, పృథ్వి, చెన్నై హెల్త్ కేర్ సర్వీసెస్ అపోలో హాస్పిటల్ ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షిణకు సహకరించండి

కడప కల్చరల్ : పుష్పగిరి దివ్యక్షేత్రంలో తాము ఆ క్షేత్రం పీఠాధిపతి ఆధ్వర్యంలో చేపట్టిన గిరి ప్రదక్షిణకు భక్తులు, ప్రముఖులు సహకరించాలని జిల్లా అర్చక పురోహిత ఐక్యవేదిక అధ్యక్షులు విజయ్‌భట్టర్, జగన్మాత మారెమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు సట్టి భారతి, శ్రీ కల్యాణ సీతారామాలయం ధర్మకర్త వేణుగోపాల్ తదితరులు తెలిపారు. సోమవారం నగరంలోని బ్రాహ్మణవీధిలోగల సంస్థ కార్యాలయంలో విజయభట్టర్ విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. గిరి ప్రదక్షిణ పుష్పగిరిలో 60 ఏళ్ల క్రితం ఉండేదని, ఇది పురాతన సంస్కృతిలో భాగమని, దేశంలో కేవలం రెండు చోట్ల మాత్రమే ఉందన్నారు. పీఠాధిపతి అనుమతితో ఈ సంప్రదాయాన్ని పునరుద్ధరించేందుకు తాము ధార్మిక వేత్తలతో కలిసి కార్యక్రమానికి ముహూర్తం నిర్ణయింపజేశామన్నారు. సట్టిభారవి మాట్లాడుతూ మార్చి 1న ఉదయం 7.46 గంటలకు 'పుష్పగిరి' ప్రదర్శనను పీఠాధిపతి పరిక్రమారంభ పేరిట ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించాలని డిప్యూటీ సీఎంతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులకు ఆహ్వానాలు అందించామని తెలిపారు. వేణుగోపాల్ మాట్లాడారు. ఈ సమావేశంలో మహోదర నాగేంద్రప్రసాద్, సత్యనారాయణగాంధీ, వరప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీతి మృతికి కారకులైన వారిని శిక్షించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న బంజారాసంఘం నాయకులు

కడప రూరల్: తెలంగాణలో ర్యాగింగ్ భూతానికి బలైన వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతిభాయి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు శివనాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు వేణుగోపాల్ నాయక్ కోరారు. ప్రీతి మృతికి నివాళులర్పిస్తూ ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అంబేడ్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ర్యాగింగ్‌పై కఠిన ఆంక్షలను అమలు చేయాలన్నారు. సంఘం నాయకులు జగన్నాయక్, వెంకట శివ, చంద్రశేఖర్, అంకుశం, అంజి, బాలాజీ, సరోజమ్మ, శాంతి, భాగ్యలక్ష్మి, మహేశ్వరితోపాటు బంజారా సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సైన్స్ పుస్తకాన్ని ఆవిష్కరించిన జేవీవీ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సర్ సీవీ రామన్ రచించిన 'ఆకాశం నీలంగా ఎందుకు ఉంటుంది' పుస్తకాన్ని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఆవిష్కరించారు. జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా ఎండీ చలపతి తెలుగులో అనువదించిన ఈ పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరిచారు. ఈ సదర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సర్ సీవీ రామన్ రోజువారి జీవితంలో ఆశ్చర్యాన్ని కలిగించే ప్రకృతి రహస్యాలను, శాస్త్రీయ విజ్ఞానాన్ని పుస్తకాల ద్వారా మనకు అందించారని తెలిపారు. జేవీవీ అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ సైన్స్‌లో నోబుల్ బహుమతి పొందిన భారతీయుల్లో సీవీ రామన్ మొదటి వారని, ప్రకృతిపై తనకు వచ్చిన ప్రతి సందేహాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి నిర్ధారించుకున్నారని తెలిపారు. సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు బయపురెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆదినారాయణ, భూషణంరెడ్డి, రాజేశ్వరి, వెంకట లక్ష్మి, రాజశేఖర్‌రెడ్డి, రవిశేఖర్, శ్రీ నిత, వీర నాగేంద్రకుమార్, కల్పన పాల్గొన్నారు.

## చిరుధాన్యాల సాగుతో అధిక రాబడి


– కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య



మాట్లాడుతున్న కేవీకే కో–ఆర్డినేటర్ వీరయ్య

కడప అగ్రికల్చర్: చిరుధాన్యాల సాగుతో అధిక రాబడిని సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2023 ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. సోమవారం కేవీకేలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 13వ విడత రైతుల ఖాతాలో జమ ప్రత్యేక వీక్షణ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో అధికరాబడిని పొందవచ్చన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి శ్రీనివాసచారి, ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్ మురళీకృష్ణ సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, జీవ రసాయనిక పద్ధతులు గురించి వివరించారు. ఆత్మ పీడీ విజయలక్ష్మి, ఆత్మ పథక ఉప సంచాలకులు పద్మలత భూమిలో సేంద్రియ కర్బన పదార్థాన్ని ఎలా పెంచుకోవాలో వివరించారు. శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, శిల్పకళ, ప్రశాంతి, మహేష్‌బాబు, మానస పాల్గొన్నారు.

## అడవికి నిప్పు .. మానవాళికి ముప్పు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎఫ్ఓ సందీప్ రెడ్డి

కడప కార్పొరేషన్: అడవికి నిప్పు పెడితే మానవాళికి ముప్పు వాటిల్లుతుందని డీఎఫ్ఓ పీవీ సందీప్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని మామిళ్లపల్లె, ఇందిరా నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో అగ్గి పెట్టడం వల్ల తరతరాలుగా పెంచి పోషిస్తున్న వృక్ష, జంతు జాతి నశించిపోతుందన్నారు. వేసవిలో అడవికి నిప్పు పెట్టకుండా అటవీశాఖకు సహకరించాలన్నారు. అడవిలో నిప్పును రగిలించే పదార్థాలు తీసుకెళ్లడం, వంటలు చేయడం, అగ్గిపెట్టెలు తీసుకెళ్లడం, పశువులు, గొర్రెల కాపరులు అడవిలో ఎండుగడ్డిని తగులబెట్టడం చేయరాదన్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం ఇలాంటి వారు శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఎఫ్ఆర్ఓ ఓబులేశు, ఎఫ్ఎస్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## క్రీడల సామగ్రి వితరణ

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని ఎర్రమాసపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు క్రీడాసామగ్రిని వితరణగా ఇచ్చారు. ఈ క్రీడా సామగ్రిని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు పిల్లల మానసిక వికాసానికి ఎంతో తోడ్పాటునిస్తాయన్నారు. బీటెక్ విద్యార్థులు మానవసేవే మాధవ సేవని గుర్తు చేస్తూ తమ వంతుగా విద్యార్థులకు క్రీడా సామగ్రి అందచేయడం అభినందనీయం అన్నారు. కొప్పర్తి గ్రామ అసిస్టెంట్ ఇంజనీర్ జగదీశ్వర్ రెడ్డి, ఇరిగేషన్ డిపార్టుమెంట్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సునీల్‌కుమార్, కళాశాల పీడీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.